క్లుప్తంగా

పదో తగరతి విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ



యడ్లపాడు: ప్రణాళికాబద్ధంగా చదివిన వారు మానసిక ఒత్తిడిని జయిస్తారని..ప్రశాంతంగా పరీక్షలు రాసేందుకు అది ఎంతో దోహదపడుతుందని పారిశ్రామికవేత్త రావూరి నాగేశ్వర రావు చెప్పారు. గుంటూరుకు చెందిన డీఎస్ఆర్ ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో మండలంలోని లింగారావుపాలెం జెడ్పీ హైస్కూలులో పదో తరగతి విద్యార్థులకు శనివారం పరీక్ష సామగ్రిని అందించారు. ఈ సందర్భంగా డీఎస్ఆర్ సర్కిల్ సభ్యులు మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి తమ సర్కిల్ సహకారం అందించేందుకు సిద్ధంగా ఉందని తెలిపారు. అనంతరం పాఠశాల హెచ్ఎం కేవీ రామిరెడ్డి సర్కిల్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో దామచర్ల శ్రీనివాసరావు, జంపాల శివబాబు, ఎస్ఎం చైర్మన్ షేక్ మీరావలి, గ్రామపెద్దలు నంబూరి శివరామకృష్ణయ్య, తోకల సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బధిరుల పాఠశాలలో అన్నదానం

వినుకొండ(నూజెండ్ల): మండలంలోని విఠంరాజుపల్లిలో గల బధిరుల పాఠశాల విద్యార్థులకు లింగమల్లు కిశోర్‌బాబు ఆధ్వర్యంలో శనివారం అన్నదానం చేశారు. సొసైటీ చైర్మన్ దుద్దుగోల జానయ్య పాల్గొని అన్నదానాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో లింగమల్లు భార్గవి, బొమ్మనబోయిన శ్రీనివాసరావు, బంగారం, శ్రీనివాసరావు, పాస్టర్ జాషువా, శ్రీను మాస్టార్ పాల్గొన్నారు.

లైసెన్సుల రెన్యువల్, రిజిస్ట్రేషన్ తప్పనిసరి

వినుకొండ టౌన్: వ్యాపారస్తులంతా దుకాణాల లైసెన్స్‌లను తప్పనిసరిగా అందుబాటులో ఉంచుకోవాలని గుంటూరు ఉప కార్మిక కమిషనర్ ఎ. గాయత్రి సూచించారు. పట్టణంలోని ఎన్ఎస్పీ కాలనీలో గల సహాయ కార్మిక అధికారి కార్యాలయంలో శనివారం వర్తక, వ్యాపార సంస్థల అసోసియేషన్ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గాయత్రి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ దుకాణ సంస్థల చట్టం – 1988 అనుసరించి దుకాణాల లైసెన్స్‌లను ఎప్పటికప్పుడు రెన్యువల్, రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. వినుకొండ కార్మిక శాఖ అధికారి కిలారు విష్ణు మాట్లాడుతూ కార్మిక శాఖ చట్టాలకు లోబడి వ్యాపారాలను నిర్వహించుకోవాలని చెప్పారు.

ముస్లింలకు టీడీపీ, జనసేనలు తీవ్ర అన్యాయం

నరసరావుపేట: తెలుగుదేశం, జనసేన పార్టీలు శనివారం ప్రకటించిన అభ్యర్థుల జాబితాలో ఒకే ఒక్క ముస్లిం అభ్యర్థికి సీటు కేటాయించి తీవ్ర అన్యాయం చేశారని వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగ రాష్ట్ర కార్యదర్శి షేక్ ఖాదర్ బాషా పేర్కొన్నారు. టీడీపీ ప్రకటించిన 94స్థానాల్లో ఒక్క ముస్లింకు స్థానం ఇచ్చారని, జనసేన ప్రకటించిన పది స్థానాల్లో ఒక్కరికీ పోటీచేసే అవకాశం ఇవ్వలేదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ముస్లిం మైనార్టీలు 18శాతం వరకు ఉన్నారన్నారు. వైఎస్సార్ సీపీ ఇప్పటివరకు ప్రకటించిన 68మంది అభ్యర్థుల్లో ఏడుగురికి స్థానం కల్పించి సంపూర్ణ న్యాయం చేసిందని తెలిపారు. దీన్ని బట్టి ముస్లిం మైనార్టీలపై ఎవరికి ప్రేమ ఉందో అర్థమవుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో మైనార్టీలంతా వైఎస్సార్ సీపీ అభ్యర్థులకే మద్దతు పలకాలని ఆయన కోరారు.

మధ్యాహ్న భోజన అమలులో నిర్లిప్తత తగదు



నాదెండ్ల: మధ్యాహ్న భోజన అమలులో నిర్లిప్తత తగదని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి ఉపాధ్యాయులకు సూచించారు. మండలంలోని పలు పాఠశాలల్ని శనివారం ఆమె తనిఖీ చేశారు. బుక్కాపురంలోని ఓసీ, ఎస్సీ ఏరియాల్లోని ప్రాథమిక పాఠశాలల్ని సందర్శించారు. రెండు పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకంలో చిన్నారులకు వడ్డించే ఆహార పదార్థాలపై అసంతృప్తి వ్యక్తం చేశారు. కంప్లెయింట్ బుక్స్ మెయిన్‌టైన్ చేయకపోవడం, ఎస్సీ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో రికార్డులు సరిగా లేకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. చదువు ఆపేసిన విద్యార్థుల జాబితా తయారు చేసి వారు తిరిగి పాఠశాలలకు హాజరయ్యేలా చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు. బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కల్పించారు. అనంతరం పలు అంగన్‌వాడీ కేంద్రాల్ని సందర్శించారు. చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహార పంపిణీపై సంతృప్తి వ్యక్తం చేశారు. గణతంత్ర దినోత్సవం రోజున చిన్నారులకు నిర్వహించిన ఆటల పోటీల్లో విజేతలకు ఆమె బహుమతులు అందించారు. కార్యక్రమంలో సర్పంచులు అల్లడి రవికుమార్, పెరుమాళ్లపల్లి వెంకటేశ్వర్లు, ఏసీడీపీవో నిర్మలారాణి, పీఎంసీ చైర్మన్లు అరుణ్‌బాబు, గేరా నాగబాబు, ఉప సర్పంచ్ అల్లం ఆంజనేయులు, అంగన్‌వాడీ టీచర్లు ఉషారాణి పాల్గొన్నారు.

జగనన్నది మాట తప్పని నైజం

- వైఎస్సార్‌సీపీ నియోజక సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడు
- మహిళా సాధికారతకు ఆసరా ఊతం
- ఇచ్చిన మాట నిలబెట్టుకున్న సీఎం వైఎస్. జగన్
- పొదుపు మహిళలను మోసం చేసిన చంద్రబాబు
- మండలంలో 1075 డ్వాక్రా గ్రూపులకు రూ.33.92 కోట్లు మాఫీ
- సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసిన అక్కచెల్లెమ్మలు



డ్వాక్రా మహిళలకు మెగా చెక్కును అందజేస్తున్న మల్లెల రాజేష్‌నాయుడు

యడ్లపాడు: సీఎం జగనన్నది మాట తప్పని నైజమని, మాటంటే చేస్తారని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడు అన్నారు. జిల్లావ్యాప్తంగా కొనసాగుతున్న ఆసరా పండుగ సంబరాల్లో భాగంగా శనివారం యడ్లపాడులో నాలుగో విడత ఆసరా చెక్కుల పంపిణీ చేశారు. వైఎస్సార్ క్రాంతిపథం ఆధ్వర్యంలో ఏర్పాటైన ఈ సంబరాల్లో రాజేష్‌నాయుడు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. పొదుపు మహిళల ఆర్థిక అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ ఆసరా పథకాన్ని అమలు చేస్తోందని తెలిపారు. ముందుగా డ్వాక్రా మహిళలు, పార్టీ శ్రేణులతో కలిసి ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. జగనన్నకు జై..థ్యాంక్యూ సీఎం సార్ అంటూ నినాదాల రూపంలో మహిళలు కృతజ్ఞతల్ని చాటుకున్నారు.

జగన్‌ది సాయం..బాబుది మోసం

రుణమాఫీతో మహిళల అభ్యున్నతికి సాయం చేసింది జగన్ అయితే వారిని బ్యాంకుల్లో డిఫాల్టర్లుగా చేసి మోసగించింది చంద్రబాబు అని మల్లెల రాజేష్‌నాయుడు విమర్శించారు. పొదుపు మహిళలను లక్షాధికారుల్ని చేయాలనే సంకల్పంతో మహానేత వైఎస్సార్ పావలా వడ్డీని ప్రవేశపెట్టారన్నారు. ఆయన తనయుడు సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి మరో ముందుడుగు వేసి 2019 ఏప్రిల్ 11 నాటికి రాష్ట్రంలోని పొదుపు సంఘాలకు ఉన్న రుణాల్ని అధికారంలోకి వస్తే నాల్గు విడతల్లో మాఫీ చేస్తానని హామీ ఇచ్చారన్నారు. ఇచ్చిన మాట ప్రకారం వైఎస్సార్ ఆసరా పథకాన్ని అమలు చేశారని తెలిపారు. టీడీపీ అధినేత చంద్రబాబు డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తానని మహిళల్ని మోసం చేశారని, దీంతో రాష్ట్రంలో 30 లక్షల మంది డిఫాల్టర్లుగా మిగిలిపోయారని వివరించారు. తమ ప్రభుత్వ హయాంలో మండలానికి చెందిన 1,075 డ్వాక్రా గ్రూపుల్లోని 10,771 మంది సభ్యులకు నాలుగు దఫాల్లో రూ.33.92 కోట్ల రుణమాఫీ జరిగినట్లు ఆయన తెలియజేశారు. నాల్గో విడత కింద మండలంలో రూ.8.48 కోట్లు మాఫీ చేసినట్లు చెప్పారు. మహిళలకు మేలు చేసిన పార్టీకే మద్దతు నివ్వాలని, చంద్రబాబు మోసపూరిత హామీల్ని నమ్మి మళ్లీ మోసపోవద్దని ఆయన కోరారు. అక్కచెల్లెమ్మలు మరింత ఆర్థిక అభ్యున్నతి సాధించాలంటే జగనన్నకు అండగా నిలిచి ఆశీర్వదించాలని రాజేష్‌నాయుడు కోరారు. అనంతరం డ్వాక్రా సంఘ నాయకులు, సభ్యులకు నాలుగో విడత ఆసరా కింద రూ.8.48 కోట్లు, స్త్రీనిధి కింద 898 మందికి రూ.4.74 కోట్లు, ఉన్నతి కింద 218 మందికి రూ.1.13 కోట్ల మెగా చెక్కుల్ని ఆయన అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ పిడతల ఝాన్సీ సాగర్, సర్పంచ్ కారుచోల హేమ, ఎంపీటీసీ సభ్యురాలు కీర్తి అరుణ్‌కుమార్, సొసైటీ అధ్యక్షుడు బసెల శివరామకృష్ణ, సమాఖ్య మండల అధ్యక్షురాలు ఆర్. సెల్వీ, పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి చల్లా యజ్ఞేశ్వరరెడ్డి, యడ్లపాడు, నాదెండ్ల, చిలకలూరిపేట మండలాల పార్టీ అధ్యక్షులు ఘంటా శంకర్, గొంటు శ్రీనివాసరెడ్డి, గుత్తా వేమలయ్య, నాయకులు ఆలోకం వెంకట లక్ష్మీనారాయణ, గుత్తి సింగయ్య, సాంబశివ రావు, మానుకొండ విజయభాస్కరరెడ్డి, పోపూరి వేణుగోపాలరావు, పాలూరి శ్రీనివాసరెడ్డి, కొప్పుల శ్యామ్యేల్‌పాల్, పందుల బుల్లెబ్బాయ్, బి. శ్రీను, పి. రెహమాన్, ఏకుల చినవీరయ్య, వలేటి ఉదయ్‌కిరణ్, చాగంటి శ్రీధర్, పల్లపు రవి, ఖాదర్‌మస్తాన్, ముగ్దూం, సుభాని, కరీముల్లా, ఎం. కోటేశ్వరరావు, జాకీర్, ఎంపీడీవో శ్రీనివాసరావు, ఏపీఎం జీవన్, వీవోఏలు పాల్గొన్నారు.



హాజరైన మహిళలు

సన్మార్గంలో జీవనం ఆనందం

సన్మార్గంలో జీవించడం అనంతమైన ఆనందాన్ని కలిగిస్తుందని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడు చెప్పారు. స్థానిక ఎర్రకొండ వద్ద కొలువున్న రహదారి మాత క్షేత్ర ద్వితీయ వార్షికోత్సవంలో శనివారం ఆయన పార్టీ నాయకులతో కలిసి పాల్గొన్నారు. యడ్లపాడు ఆర్‌సీఎం చర్చి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఉత్సవాల్లో గుంటూరు బిషప్ డాక్టర్ చిన్నాబత్తుని భాగ్యయ్య, ఫాదర్ కె. బాల సుభాష్‌చంద్రబోస్ ఆయన్ను సాదరంగా ఆహ్వానించారు. ముందుగా రహదారిమాతను సందర్శించి ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేష్‌ను సత్కరించి జ్ఞాపికను బహూకరించారు. కార్యక్రమంలో ఎంపీపీ పిడతల ఝాన్సీసాగర్, సర్పంచ్ కె. హేమ, యడ్లపాడు, నాదెండ్ల మండల పార్టీ అధ్యక్షులు ఘంటా శంకర్, గొంటు శ్రీనివాసరెడ్డి, పార్టీ యూత్ అధ్యక్షులు కొప్పుల శ్యామ్యేల్‌పాల్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు పి. బుల్లెబ్బాయి, వలేటి ఉదయ్‌కిరణ్, పల్లపు రవి, ఎడ్లూరి అశోక్, పి. పున్నారావు, కట్టా నాగార్జున, బి. శ్రీను, ఎం. మోహన్‌రావు, పి. వెంగళరాయుడు, గుత్తి సింగయ్య పాల్గొన్నారు.

జగనన్న పాలనలో ప్రతి ఇంటా సంతోషాలు



ప్రజలకు కరపత్రాలు అందజేస్తున్న మల్లెల రాజేష్‌నాయుడు

చిలకలూరిపేట: జగనన్న పాలనలో ప్రతి ఇంటా సంతోషాలు వెల్లివిరుస్తున్నాయని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడు చెప్పారు. పట్టణంలోని తొమ్మిదో వార్డు పరిధిలోని రజక కాలనీ, జాలయ్య కాలనీ, నెహ్రూనగర్‌లలో మనఊరు– మన రాజేష్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న రాజేష్‌నాయుడుకు గడపగడపనా ఆత్మీయ స్వాగతం లభించింది. తీన్మార్ డోలక్ వాయిద్యాలు, బాణసంచా, కనకతప్పట్లతో స్థానికులు ఘన స్వాగతం పలికారు. మహిళలు హారతులు పట్టి ఆప్యాయత చాటుకున్నారు. ఈ సందర్భంగా మల్లెల రాజేష్‌నాయుడు మాట్లాడుతూ జగనన్న సంక్షేమానికి నిజమైన అర్థం చెప్పారని, సంక్షేమం పేదవాళ్ల హక్కు, ప్రభుత్వ బాధ్యతని నిరూపించారని వెల్లడించారు. గడిచిన ఐదేళ్లలో జగనన్న పాలనలో రాష్ట్రంలో అమలు చేస్తున్న పథకాలు నిరవధికంగా కొనసాగితే అభివృద్ధి తానంతట అదే ఉరుకలు వేస్తుందని పేర్కొన్నారు. పేదల పిల్లల చదువులపై జగనన్నకు ఉన్న పారదర్శకత దేశంలో మరే పాలకుడికి లేదని వెల్లడించారు. పేద కుటుంబాల పిల్లలు ఇంగ్లిషు మీడియంలో విద్య అభ్యసించడం ద్వారా ప్రపంచ స్థాయి అవకాశాలు అందిపుచ్చుకొని ఉన్నత స్థానాలకు ఎదగడం వల్ల రాష్ట్రానికి కొత్త అభివృద్ధి ద్వారాలు తెరుచుకుంటాయని పేర్కొన్నారు. ఒక్క తొమ్మిదో వార్డు పరిధిలోనే పాఠశాల, హెల్త్ సెంటర్, రోడ్లు, డ్రైనేజీల అభివృద్ధికి రూ. 1.43 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. సంక్షేమ పథకాల ద్వారా రూ. 16.26 కోట్ల మేర ప్రజలకు లబ్ధి చేకూరిందని వెల్లడించారు. ప్రతి కుటుంబం తమకు జగనన్న ప్రభుత్వంలో ఎంతో మేలు జరిగిందని సంతోషంగా చెబుతున్నారని... మన భవిత జగన్‌తోనే అని నినదిస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ వలేటి వెంకటేశ్వరరావు, కౌన్సిలర్లు చింతపల్లి విల్సన్, బేరింగ్ మౌలాలి, పిల్లి సాగర్‌బాబు, సాపా సైదావలి, రాష్ట్ర ముస్లిం కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ దరియావలి, వైఎస్సార్ సీపీ నాయకులు గొంటు శ్రీనివాసరెడ్డి, మారుబోయిన నాగరాజు, నకరికంటి శ్రీకాంత్, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఆరోగ్యవంతమైన బాలలతోనే మెరుగైన సమాజం



నాదెండ్ల: నేటి ఆరోగ్య వంతమైన బాలలే రేపటి మెరుగైన పౌర సమాజమని, సామాజిక సేవా భావంతో బాలల విద్య, ఆరోగ్య పరిరక్షణపై తమ వంతుగా చేయూత నందిస్తున్నామని కనపర్రులోని హెచ్‌బీఎల్ పవర్‌సిస్టమ్స్ లిమిటెడ్ సంస్థ మేనేజర్ పి. విజయలక్ష్మి తెలిపారు. సంస్థ ఆధ్వర్యంలో బుక్కాపురం, కనపర్రు, ఎండుగుంపాలెం గ్రామాల్లోని 11 అంగన్‌వాడీ కేంద్రాల్ని దత్తత తీసుకుని 146 మంది చిన్నారులకు ప్రతి నెలా పౌష్టికాహారాన్ని అందించనున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సభలో ఆమె మాట్లాడుతూ చిన్నారులు ఆరోగ్యంగా ఉంటేనే భవిష్యత్తులో మంచి పౌర సమాజం నిర్మితమవుతుందన్నారు. సామాజిక సేవలో భాగంగా తమ కంపెనీ తరఫున విస్తృత కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచులు అల్లడి రవికుమార్, పెరుమాళ్లపల్లి వెంకటేశ్వర్లు, సీడీపీవో శాంతకుమారి, ఉప సర్పంచ్ అల్లం ఆంజనేయులు, పీఎంసీ చైర్మన్లు నాగరాజు, అరుణ్‌బాబు, ఏసీడీపీవో నిర్మల, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

ఆర్బీకేల ద్వారా కందులు కొనుగోలు ప్రారంభం



శావల్యాపురం: మండలంలోని శానంపూడి రైతుభరోసా కేంద్రం నుంచి కందులు కొనుగోలు ప్రారంభించినట్లు మండల వ్యవసాయ అధికారి పల్లపోతుల ప్రవీణ్ శనివారం తెలిపారు. మండలంలోని 11 రైతుభరోసా కేంద్రాల నుంచి ప్రభుత్వ మద్దతు ధర క్వింటా రూ.9754కు రైతుల నుంచి నేరుగా కొనుగోలు చేస్తున్నట్లు చెప్పారు. దళారుల నుంచి మోసపోకుండా ప్రభుత్వం ఈ చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. ఈ–క్రాప్ నమోదు చేసుకున్న రైతుల నుంచి పారదర్శకంగా కొనుగోలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. వారం రోజుల వ్యవధిలో రైతు బ్యాంకు ఖాతాలో ప్రభుత్వం నగదు జమ చేస్తుందని చెప్పారు. ఆయనతో పాటు రైతుభరోసా కేంద్ర సిబ్బంది ఉన్నారు.

రైతాంగ సమస్యల పరిష్కారానికి శివారెడ్డి కృషి



శివారెడ్డి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు, సీపీఎం నాయకులు

చిలకలూరిపేట: రైతులు, వ్యవసాయ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం జీవితం అంకితం చేసిన యోధుడు సింహాద్రి శివారెడ్డి అని పట్టభద్రుల ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావు కొనియాడారు. పట్టణంలోని పండరీపురంలో ఉన్న సీపీఎం కార్యాలయంలో ఆ పార్టీ నాయకుడు శివారెడ్డి ఏడో వర్ధంతి సభ శనివారం నిర్వహించారు. ముందుగా నేతలు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడుగా, రైతు నాయకుడిగా ఆయన సేవలు మరువలేనివని చెప్పారు. సాగునీటి కొరత, నదుల అనుసంధానంపై ఎంతో అవగాహనతో రైతాంగాన్ని జాగృత పరిచేవారని వివరించారు. కార్యక్రమంలో సీపీఎం పల్నాడు జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం. రాధాకృష్ణ, నాయకులు గుంటూరు విజయకుమార్, ఆంజనేయులునాయక్, హనుమంతరెడ్డి, పేరుబోయిన వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నూరు శాతం పన్ను వసూలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎల్‌పీవో పుట్టా రమణయ్య

యడ్లపాడు: ఇంటి పన్నుల వసూళ్లను మార్చి 30వ తేదీ నాటికి వంద శాతం వసూలు చేయాలని నరసరావుపేట డివిజనల్ పంచాయతీ అధికారి పుట్టా రమణయ్య ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయాన్ని శనివారం ఆయన సందర్శించారు. ఇంటిపన్ను వసూళ్లపై ఈవోపీఆర్‌డీ వరుధినిని ఆరా తీశారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో మండలంలో 12,500 నివాసాలకు గానూ రూ.1.46 కోట్ల డిమాండ్ ఉందని, వాటిలో రూ.97,92,839తో రమారమీ 40శాతం వసూలు పూర్తి చేసినట్లు డీఎల్‌పీవోకు తెలిపారు. వీటిని వచ్చే నెలాఖరుకు వందశాతం పూర్తి చేయాలని చెప్పారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి గానూ 15వ ఆర్థిక సంఘ గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళిక (జీపీడీపీ)తో పాటు గత రెండేళ్ల జీపీడీపీ అనుబంధ ప్రణాళికల్ని సిద్ధం చేయాలని సూచించారు. 15వ ఆర్థిక సంఘం నిధుల్ని నిబంధనలకు అనుగుణంగా ఖర్చు చేయాలని, అతిక్రమించిన వారిపై చర్యలు తప్పవంటూ హెచ్చరించారు. అనంతరం పన్నుల వసూళ్లు, జీపీడీపీ ప్రణాళిక తయారీపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో అన్ని పంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.

వైభవంగా కొండగురునాథుని తిరునాళ్ల



స్వామివారి మెట్ల వద్ద ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ(నూజెండ్ల): కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారం కొండగురునాథుని తిరునాళ్లకు శనివారం భక్తులు పోటెత్తారు. ఉదయం నుంచే వేలాదిమందిగా తరలివచ్చి స్వామిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఉపవాసం ఉన్న మహిళలు పొంగళ్లు సమర్పించారు. పల్నాడు, గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాలతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా భక్తులు తరలిరావడంతో తిరునాళ్ల ప్రాంతం కొండ పరిసరాలు భక్తులతో కిక్కిరిసిపోయింది. కొండపైన వెలసిన సంతానలింగేశ్వరుడు, నాగేంద్రస్వామి, శివాలయాల్లో భక్తులు పూజలు చేశారు. తిరునాళ్ల సందర్భంగా 10కి పైగా భారీ విద్యుత్ ప్రభలను ఏర్పాటు చేశారు.

పటిష్ట బందోబస్తు

నరసరావుపేట డీఎస్పీ వర్మ ఆధ్వర్యంలో ఇద్దరు సీఐలు, 10మంది ఎస్ఐలు, 100మంది పోలీసులతో అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పటిష్ట బందోబస్తు నిర్వహించారు. వినుకొండ ఆర్టీసీ, అద్దంకి, దర్శి నుంచి 10కి పైగా ప్రత్యేక బస్సులు తిరునాళ్లకు నడుపుతోంది.

పెద్దఎత్తున అన్నదానాలు

తిరునాళ్ల సందర్భంగా భక్తుల సౌకర్యార్థం కాపు సేవా సమితి, శాలివాహన, యాదవ, రెడ్డి , విశ్వబ్రాహ్మణ, ఆర్యవైశ్య, వడియరాజుల సేవా సంఘాలు భక్తులకు అన్నదానాలు ఏర్పాటు చేశారు.

ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ప్రత్యేక పూజలు

తిరునాళ్లను పురస్కరించుకొని కొండగురునాథుని స్వామిని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు దర్శించుకొని ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఘనస్వాగతం పలికి శాలువాలతో సత్కరించారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నారు.

చలివేంద్ర ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

వినుకొండ టౌన్: పట్టణంలోని చలివేంద్ర ఆంజనేయ స్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ప్రధాన అర్చకులు చంద్రబాబు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజల్ని నిర్వహిస్తున్నారు. కార్యక్రమాల చివరి రోజు శనివారం స్వామికి విశేష అభిషేకాలు, హోమం, శ్రీ సీతారాముల శాంతి కల్యాణం, మహా సంప్రోక్షణ, కుంభాభిషేకం, కల్యాణ మహోత్సవం నిర్వహించారు. పీటలపై తాతా రమేష్ బాబు, సనిశెట్టి స్వామి రామారావు, పువ్వాడ రామలింగేశ్వరరావు, చిన్న ఐరామూర్తి, దేవరశెట్టి నాగేశ్వరరావు, రెడ్డి నాసరయ్య, జయవరపు రమేష్, మాలపాటి చంద్రశేఖరరావు దంపతులు కూర్చున్నారు. అనంతరం స్వామి తీర్థప్రసాదాలను భక్తులకు పంపిణీ చేశారు.

ఎన్నికల విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు

శావల్యాపురం: ఎన్నికల విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామని తహసీల్దారు నక్కా లక్ష్మీ లావణ్య తెలిపారు. కార్యాలయంలో శనివారం బీఎల్‌వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ అంకితభావంతో విధులు నిర్వహించాలన్నారు. నూతన ఓటుహక్కు దరఖాస్తులు, తొలగింపులు మార్పులు, చేర్పులు దరఖాస్తులను పెండింగ్ లేకుండా వెంటనే పరిష్కరించాలని చెప్పారు. నేటి వరకు వివిధ రకాల ఓట్లు దరఖాస్తులు 320 పెండింగ్‌లో ఉన్నాయని, అవన్నీ క్షేత్రస్థాయిలో విచారణ చేసి సమగ్ర ఆధారాలు అందజేసిన వారికి ఓటు హక్కు కల్పించాలని ఆదేశించారు. రెండు రోజుల వ్యవధిలో దరఖాస్తులన్నీ నూరు శాతం పరిష్కరించాలని చెప్పారు. పార్టీలు, కులమతాలకు అతీతంగా అర్హత ఉన్న వారందరికీ ఓటు హక్కు కల్పించే బాధ్యత బీఎల్‌వోలపై ఉందని తెలిపారు. క్షేత్రస్థాయిలో ఇబ్బందుల్ని ఉన్నతాధికారుల దృష్టికి తేవాలని సూచించారు. సమావేశంలో డెప్యూటీ తహసీల్దార్లు వేముల వెంకట నాగరాజు, పెరిసోముల నాసరయ్య పాల్గొన్నారు.

బెంగళూరుకు సూపర్ లగ్జరీ సర్వీసు ప్రారంభం

వినుకొండ టౌన్: నరసరావుపేట నుంచి వినుకొండ మీదుగా బెంగళూరుకు సూపర్ లగ్జరీ సర్వీసును నూతనంగా ప్రారంభించినట్లు వినుకొండ డిపో మేనేజర్ బాణావతు కోటేశ్వరరావు నాయక్ శనివారం తెలిపారు. ఈ సర్వీసు నరసరావుపేటలో సాయంత్రం 4.30లకు బయలుదేరి వినుకొండకు 5.20గంటలకు చేరుకుంటుందని చెప్పారు. డిపోలో 5.45 గంటలకు బయలుదేరి కుంట, మార్కాపురం, కంభం, కొమరోలు, పోరుమామిళ్ల, మైదుకూరు, కడప, రాయచోటి, మదనపల్లి, యస్. కోట మీదుగా మరుసటి రోజు ఉదయం 6.30గంటలకు బెంగళూరు చేరుకుంటుందని వివరించారు. తిరుగు ప్రయాణంలో అదే రోజు రాత్రి 7గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 7గంటలకు వినుకొండకు చేరుకుంటుందని చెప్పారు. వినుకొండ పట్టణ, పరిసర ప్రాంత ప్రజలంతా వినియోగించుకోవాలని ఆయన సూచించారు.

లారీ ఢీకొని గుమస్తా మృతి



గౌస్‌పాషా (ఫైల్)

నాదెండ్ల: రోడ్డు ప్రమాదంలో గుమస్తా మృతి చెందిన సంఘటన గణపవరం జాతీయ రహదారి సీఆర్ కళాశాల ఎదురుగా శనివారం చోటు చేసుకుంది. విజయవాడ భవానీపురానికి చెందిన షేక్ గౌస్‌పాషా (41) అక్కడే ఓ పండ్ల దుకాణంలో గుమస్తాగా పని చేస్తుంటాడు. యజమాని సూచన మేరకు శనివారం ద్విచక్ర వాహనంపై చిలకలూరిపేటలోని పండ్ల వ్యాపారుల వద్ద నగదు వసూలుకు వచ్చాడు. తిరిగి విజయవాడకు వెళ్తుండగా గణపవరం సీఆర్ కళాశాల వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో గౌస్‌పాషా రోడ్డుపై పడగా, వాహనం వెనుక టైరు తలపైకి ఎక్కింది. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిలకలూరిపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సమాచారం అందుకున్న నాదెండ్ల పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు నమోదు చేసుకున్నారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. స్థానికుల సమాచారంతో బంధువులు హుటాహుటిన ప్రభుత్వ వైద్యశాలకు చేరుకుని భోరున విలపించారు.

విద్యార్థుల చేతుల్లో దేశ భవిష్యత్తు



విద్యార్థులతో అంజనీకుమారి తదితరులు

నరసరావుపేట ఈస్ట్: దేశ భవిష్యత్తు విద్యార్థుల చేతుల్లోనే ఉందని తెలంగాణ సీఎస్‌సీ కోర్టు సీనియర్ సూపరింటెండెంట్ పి.వి.పి.అంజనీకుమారి తెలిపారు. తిరుపతి యువతేజం ట్రస్ట్, కలాం విజన్ ఫౌండేషన్, ఐఫ్ యూత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షల్లో మంచి మార్కులు సాధించే దిశగా స్టడీ మెటీరియల్ రూపొందించి ఉమ్మడి గుంటూరు జిల్లాలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలు, జ్యోతిబా పూలే గిరిజన సంక్షేమ పాఠశాలలు, సాంఘిక సంక్షేమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పంపిణీ చేపట్టారు. దీనిలో భాగంగా శనివారం పట్టణంలోని కస్తూర్బాగాంధీ పాఠశాలలో 10వ తరగతి విద్యార్థినులకు స్టడీ మెటీరియల్ అందజేశారు. ఈ సందర్భంగా అంజనీకుమారి మాట్లాడుతూ ఈనెల 19 నుంచి 28వ తేదీ వరకు స్టడీ మెటీరియల్‌ను అందజేయనున్నట్టు తెలిపారు.విద్యార్థులు కృషి, పట్టుదల, సాధన అనే మూడు విషయాలను దృష్టిలో పెట్టుకొని జీవితంలో ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆయా సంస్థల ప్రతినిధులు డాక్టర్ సి.నారాయణస్వామి, కరీముల్లా, డాక్టర్ జి.నాగబాబు,సాయిసంపత్ పాల్గొన్నారు.

29న నాదెండ్లలో జనరిక్ ఔషధ కేంద్రం ప్రారంభం



మందుల దుకాణం ఏర్పాటు చేయనున్న భవనం

నాదెండ్ల: స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో ప్రధానమంత్రి భారతీయ జన ఔషధ కేంద్రం ఏర్పాటు పనులు చకచకా జరుగుతున్నాయి. సొసైటీ ప్రతినిధులుగా చైర్మన్ కురుకుట్ల వెంకటరెడ్డి, సెక్రటరీ టీసీహెచ్ అంజయ్యలు ఢిల్లీలో శిక్షణ తీసుకుని వచ్చారు. నాదెండ్ల గ్రామంలోని సొసైటీకి చెందిన 20 సెంట్ల విస్తీర్ణంలోని భవనంలో ఈ కేంద్రం ప్రారంభం కానుంది. మందులు విక్రయించేందుకు ఇద్దరు సిబ్బందికి శిక్షణ సైతం ఇచ్చారు. బహిరంగ మార్కెట్లో రూ.100 విలువైన మందులు జనరిక్ కేంద్రంలో రూ.33–35 ధరకే లభ్యమవుతాయి. బెంగుళూరుకు చెందిన శిల్పా మహావీర్ డ్రగ్స్, రాయపూర్‌కు చెందిన నహర్ ఫార్మా, మరికొన్ని సంస్థల నుంచి మందులు చేరనున్నాయి. శనివారం సీఈవో అంజయ్య పనులను పరిశీలించారు.

తుదిదశకు సూపర్ మార్కెట్, కామన్ సర్వీస్ సెంటర్ నిర్మాణ పనులు

సొసైటీ ఆధ్వర్యంలో జనరిక్ ఔషధ కేంద్రంతో పాటు సూపర్ మార్కెట్, కామన్‌సర్వీస్ సెంటర్ ఏర్పాటు కానున్నాయి. సూపర్ మార్కెట్‌లో నిత్యావసరాలు, కూరగాయలు అందుబాటులోకి రానున్నాయి. కామన్ సర్వీస్ కేంద్రం ద్వారా అన్ని ప్రభుత్వ బిల్లులు చెల్లించుకునే ఏర్పాటు, ఫొటోస్టాట్, లామినేషన్, ఆధార్ అప్‌డేట్ సెంటర్, మరిన్ని సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయి.

86 మంది పోలీసులకు కంటి పరీక్షలు



నరసరావుపేట: స్థానిక ఐఎంఏ భవనంలో డాక్టర్ రామలింగారెడ్డి మాక్స్ విజన్ హాస్పిటల్ ఆధ్వర్యంలో శనివారం 86మంది పోలీస్ అధికారులు, సిబ్బందికి ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ ప్రకృతి, డాక్టర్ రామలింగారెడ్డి, మాక్స్ విజన్ వైద్య సిబ్బంది పరీక్షలు చేసి మందులను ఉచితంగా అందజేశారు.